క్లుప్తంగా

కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



విజయవాడకల్చరల్: కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. చంద్రమోహన్ కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తి సంగీత విభావరి, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్రంలోని కళాకారుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిందన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా నంది నాటకోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పరచూరి విజయలక్ష్మి, ప్రభల శ్రీనివాస్, పైడిపాటి వెంకన్న, తల్లపురెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. గాయనీ గాయకులను, అతిథులను ఎమ్మెల్యే విష్ణు సత్కరించారు.

నగర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర ప్రజలకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ అంటే సేవ, శాంతి, సంతోషమని ఏసుక్రీస్తు క్షమా, ప్రేమ, శాంతి, కరుణ భావం కలిగిన వారు అని, ఏసు తన జీవితం ద్వారా మంచి మార్గంలో ఎలా నడవాలో చూపించారని పేర్కొన్నారు. ప్రజలందరూ క్రిస్మస్ పండుగను సంతోషంగా జరుపుకోవాలని, ప్రజలందరూ వారి కుటుంబ సభ్యులు ప్రేమానురాగాలతో సంతోషాలను అందరికీ పంచాలని కోరారు.

నేటి 'స్పందన' రద్దు

పటమట(విజయవాడతూర్పు): ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా నిలిచే స్పందన కార్యక్రమం సోమవారం రద్దు చేస్తున్నట్లు వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం క్రిస్మస్ సెలవు కారణంగా రద్దు చేస్తున్నామన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంతో పాటు సర్కిల్ కార్యాలయాల్లో జరిగే స్పందన రద్దు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తన కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి కొత్తపేట పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్ కుండల మార్కెట్ ప్రాంతంలో ఆవుల శేఖర్ కుటుంబం నివాసం ఉంటుంది. శేఖర్‌కు ఇద్దరు సంతానం కాగా, కుమార్తె అఖిల ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివింది. అయితే ఒక సబ్జెక్ట్ మిగిలిపోవడంతో ఇంటి వద్దే ఉండి చదువుకుంటుంది. కొంత కాలంగా అఖిల మార్కెట్‌లోని ఓ మెడికల్ షాపునకు పనికి వెళ్తుంది. అదే షాపులో పని చేసే ఓ యువకుడిని ప్రేమిస్తోంది. ఈ విషయం ఇంట్లో తెలియడంతో షాపునకు పంపడం మానేశారు. అయితే శనివారం బయటకు వెళ్లి వస్తానని చెప్పి వెళ్లిన అఖిల సాయంత్రం అయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన తండ్రి చుట్టుపక్కల వెతికినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ధనుర్మాసోత్సవాల్లో భాగంగా రామకృష్ణాపురం శ్రీదుర్గాదేవి దేవాలయంలో వేంకటేశ్వరస్వామి వారికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. లక్ష్మీనారాయణులకు ప్రీతికరమైన ధనుర్మాసం కావటంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. విష్ణు సహస్రనామపారాయణం చేశారు. ఆలయ ధర్మకర్త రాజు పర్యవేక్షించారు


నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరంలో ఆధ్యాత్మికత, సేవలను రెండు కళ్లుగా చేసుకుని పనిచేస్తున్నామని మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి అన్నారు. మందిరంలో ఆదివారం ఆలయకమిటీ ఆధ్వర్యాన నిరుపేదలకు ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ దాతలు, భక్తుల సహకారంతో షిరిడీలో మాదిరిగా అన్ని ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఏటా చలికాలంలో దుప్పట్లు పంపిణీ, నగర పాలక సంస్థ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు చెల్లింపు, నిత్యాన్నదానం, ఉచిత హోమియో, అల్లోపతి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. మందిర కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మండలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రం వన్‌టౌన్

- శతాబ్ద కాలంగా అలరారుతున్న చర్చిలు
- క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్ క్రైస్తవ ఆధ్యాత్మిక కేంద్రంగా అలరారుతోంది. నగరంలోని పశ్చిమ నియోజకవర్గం పురాతన క్రైస్తవ ప్రార్థనా మందిరాలకు నిలయంగా ఉంది. వన్‌టౌన్‌లో పలు చర్చిలకు వందేళ్లు పూర్తయ్యాయి. మరికొన్ని చర్చిలు ప్లాటినం జూబ్లీ వేడుకలను పూర్తి చేసుకున్నాయి. నగరంలో బ్రిటీష్ పాలకుల ఆధ్వర్యంలో జరిగిన రైల్వే వంతెన, కృష్ణానది ఆనకట్ట తదితర నిర్మాణాలకు వందలాది మంది ఆంగ్లో ఇండియన్స్ బెజవాడకు వచ్చారు. అలాగే 19వ శతాబ్దంలో బ్రిటీష్ పాలకుల ఆదేశానుసారం నగరానికి వచ్చిన సైనికులు స్థానికంగా స్థావరాన్ని ఏర్పాటు చేసుకొని జీవించే వారు. వారంతా తమ కోసం నగరంలోని వన్‌టౌన్ కేంద్రంగా పలు క్రైస్తవ ప్రార్థనా మందిరాలను ఏర్పాటు చేసుకున్నారు. కాలక్రమంలో ఆ ప్రార్థనా మందిరాలు శాఖోపశాఖలుగా అభివృద్ధి చెంది నగరానికి వెన్నె తెస్తున్నాయి. ఒక చర్చి నుంచి కొంత మంది విడిపోయి మరో ప్రార్థనా మందిరాన్ని ఏర్పాటు చేయడం లేదా, పెరిగిన భక్తుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో చర్చిలను ఏర్పాటు చేయడం వంటి కారణాలతో నగరంలో పలు చోట్ల విశాలమైన, అపురూపమైన క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఏర్పాటు చేయబడ్డాయి. ఆయా ప్రార్థనా మందిరాలు ప్రతి రోజూ ప్రజలకు శాంతి సందేశాన్ని అందజేస్తున్నాయి.



సెయింట్ పాల్స్ బసిలికా చర్చి

ప్రముఖ చర్చిలు

వన్‌టౌన్ తారాపేటలో ఆర్సీఎం ఆధ్వర్యంలో సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి కొనసాగుతుంది. ఈ చర్చికి 1884వ సంవత్సరం నుంచి ఫాదర్ జే.పయాత్తి బోధకునిగా ఉన్నట్లు అందుబాటులో ఉన్న రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. అయితే కొన్నేళ్ల తరువాత ఈ చర్చి పూర్తిస్థాయిలో ప్రార్థనా మందిరంగా అందుబాటులోకి వచ్చింది. అదేవిధంగా దక్షిణ ఇండియా సంఘం(సీఎస్ఐ) ఆధ్వర్యంలో గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ఎదురుగా 'సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి'ని 1900వ సంవత్సరంలో స్థాపించినట్లు చర్చి ప్రాంగణంలో ఉన్న శిలాఫలకం వివరిస్తుంది. ఈ ప్రార్థనా మందిరంలో ప్రతి ఆదివారం ప్రత్యేక ఆరాధనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. అలాగే మరో రాయల్ హోటల్ సెంటర్ వద్ద ఉన్న 'సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ టౌన్ చర్చి'ను 1906వ సంవత్సరంలో స్థాపించారు. నగరంలో ప్రథమ లూథరన్ చర్చిగా పేర్కొనే 'సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చి'ను గాంధీహిల్ వెనుక వైపు ఉన్న పాడివీధిలో 1935వ సంవత్సరంలో స్థాపించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. అంతేకాకుండా నగరంలో మొదటి ఎయిర్ కండిషన్ చర్చి కూడా ఇదే కావడం విశేషం. అదేవిధంగా ప్రైజర్‌పేటలోని 'తెలుగు బాప్టిస్ట్ చర్చి'ను 1935లో స్థాపించారు. పెజ్జోనిపేటలోని ఆర్సీఎం చర్చిని స్థాపించి అర్ధ శతాబ్దం దాటింది. ఈ చర్చిలన్ని ప్రారంభంలో చిన్నచిన్నవిగా ఏర్పడి కాలక్రమంలో విశాలమైన ప్రాంగణాల్లో ప్రజలందరినీ ఆకర్షించే విధంగా అలరారుతున్నాయి.

సామాజిక సేవా కార్యక్రమాలు

నగరంలోని అన్ని ప్రముఖ చర్చిల ఆధ్వర్యంలో పలు స్వచ్ఛంద సేవా సంస్థలు పని చేస్తున్నాయి. విద్యాసంస్థలు, వీధి బాలల సంరక్షణ, మహిళలకు శిక్షణ, ప్రాథమిక వైద్యం, వృద్ధాశ్రమం వంటి వివిధ రంగాల్లో సేవలందిస్తూ సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాయి. అంతేకాకుండా చక్కని సేవా కార్యక్రమాలతో మిగిలిన సంస్థలకు ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి.

అనేక సంస్థలకు వన్‌టౌన్ కేంద్రం

జిల్లాలోని వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న పలు చర్చిలకు, క్రైస్తవ సామాజిక సేవా సంస్థలకు వన్‌టౌన్‌లోని చర్చిలు కేంద్రాలుగా ఉన్నాయి. అదేవిధంగా గొల్లపూడి, పెద్దఅవుటపల్లి, పెజ్జోనిపేట వంటి ప్రాంతాల్లో ఉన్న చర్చిలు సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చికు అనుబంధంగా ఏర్పడినవేనని వన్‌టౌన్‌లోని క్రైస్తవ ప్రముఖులు తెలిపారు.

ఒకటో తేదీ వరకు ప్రత్యేక కార్యక్రమాలు

వన్‌టౌన్‌లోని వివిధ చర్చిల్లో ఈ నెల 20వ తేదీ నుంచి క్రిస్మస్ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలు జనవరి మొదటి తేదీ వరకూ కొనసాగుతాయి. అలాగే క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని ఆయా చర్చిలను అత్యంత సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా ఈ చర్చిలకు స్థానిక నివాసితులైన క్రైస్తవులతో పాటుగా నగరం చుట్టపక్కల ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది క్రైస్తవులు వన్‌టౌన్‌లోని చర్చిలకు విచ్చేసి ఆరాధానా కార్యక్రమాల్లో పాల్గొంటారు. కేవలం క్రిస్మస్, గుడ్‌ఫ్రైడ్ వంటి పర్వదినాల్లోనే కాకుండా ప్రతి ఆదివారం ఆయా క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ఆరాధనకు వచ్చిన ప్రజలతో కళకళలాడుతూ ఉంటాయి.



వన్‌టౌన్‌లోని సెయింట్ పాల్స్ సెంటినరీ చర్చి



విద్యుత్ కాంతుల్లో సీఎస్ఐ ఆల్ సెయింట్ చర్చి



పటమట చర్చిలో కొవ్వొత్తులు వెలిగిస్తున్న భక్తులు

సర్వమానవాళికి రక్షకుడు ఏసుక్రీస్తు



కేక్ కట్ చేస్తున్న ఫాదర్ క్రీస్తురాజు

విద్యాధరపురం...

వించిపేట(విజయవాడపశ్చిమ): లోక రక్షకుడైన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి ఆదర్శప్రాయమని సెయింట్ పీటర్స్ కేథడ్రల్ చర్చి ఫాదర్ క్రీస్తురాజు పేర్కొన్నారు. వేళంగణిమాత యువజన సేవా సంఘం అధ్యక్షుడు లకమాల రామారావు ఆధ్వర్యంలో చిట్టినగర్‌లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని క్రీస్తు జన్మవృత్తాంతం తెలియజేసేలా ఏర్పాటు చేసిన పశువుల పాకను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. బాల ఏసుకు పూలమాలలు వేసి ప్రార్ధన చేసి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం టైలర్‌పేట రామాలయంవీధిలోని సన్‌రైజ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని పశువుల పాకను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు దాసి జయప్రకాష్ కెనడి, కొపెల మోహన్, చేపూరి శ్రీనివాసరావు, వెళాంగిణిమాత యువజన సేవా సంఘం సభ్యులు సాదు వాసు, గంగాధర్, రాజా, మధు, అనీల్, సన్ రైజ్ యూత్ సభ్యులు బన్ను, సాయి పాల్గొన్నారు.

నర్సింగ్ స్కూల్‌లో ఆరోగ్యంపై అవగాహన

మధురానగర్(విజయవాడసెంట్రల్): చేతులు తరచూ శుభ్రం చేసుకోవటంతో పాటు మాస్కులు ధరించాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, హోమియో వైద్య నిపుణులు డాక్టర్ కోనా వీరబ్రహ్మం సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఆరోగ్య అవగాహన, ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం 350 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు.

సందడిగా కేబీఎన్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కాకరపర్తి భావనారాయణ కళాశాల గడిచిన ఆరు దశాబ్దాలుగా సమాజానికి అపూర్వమైన సేవలందిస్తోందని ఎమ్మెల్యే, ఆ కళాశాల పూర్వ విద్యార్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. కేబీఎన్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆ కళాశాల ప్రాంగణంలో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు సమావేశానికి హాజరై తమ అనుభూతులను, గత స్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ తాను హిందూ హైస్కూల్‌లో హైస్కూల్ విద్యను, కేబీఎన్ కళాశాలలో కళాశాల విద్యను అభ్యసించానన్నారు. కేబీఎన్ కళాశాల గడిచిన 58 సంవత్సరాలుగా అద్వితీయమైన ప్రగతిని అందిపుచ్చుకొని విజయపథంలో ముందుకు సాగుతోందన్నారు. ఆనాటి బోధనా సిబ్బంది, పూర్వ విద్యార్థులందరూ తరలిరావటం, వారు తమ అభిప్రాయాలను, నాటి జ్ఞాపకాలను పంచుకోవటం చాలా ఆనందాన్ని కలిగించిందన్నారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం మరింత పటిష్టంగా తీర్చిదిద్దేందుకు తాను అండగా ఉంటానని చెప్పారు.



పూర్వ అధ్యాపకులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి తదితరులు

మరిన్ని కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళిక..

ఇస్రో శాస్త్రవేత్త కళాశాల పూర్వ విద్యార్థిని జల్లూరి తాయారమ్మ మాట్లాడుతూ.. కళాశాలలో తాను డిగ్రీ అభ్యసించానన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ఈ విధమైన కార్యక్రమాలు తరచూ జరగాలన్నారు. కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ కళాశాల పాలకవర్గంగా పూర్వ విద్యార్థుల విజయాలను తెలుసుకొని పొంగిపోతున్నామన్నారు. మీ అందరి అండదండలతో కళాశాలను మరింత అభివృద్ధిపథంలో ముందుకు తీసుకెళ్తామన్నారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య మాట్లాడుతూ తాను హిందూ హైస్కూల్, కేబీఎన్ విద్యార్థినన్నారు. మూడు దశాబ్దాలుగా పాలకవర్గంలో కొనసాగుతూ అభివృద్ధికి పాటుపడుతున్నట్లు వివరించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దివ్వెల రామకృష్ణ, జల్లూరి నాగ శ్రీనివాసరావులు మాట్లాడుతూ ప్రతి ఏటా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు ప్రసంగించారు. కళాశాల అధ్యాపకులు డాక్టర్ జేవీ చలపతిరావు, వి.శేషగిరి రావు నిర్వహించారు.

1965 నుంచి 2022 వరకూ చదువులు పూర్తి చేసిన ఆ కళాశాల పూర్వ విద్యార్థులు కేబీఎన్ కళాశాలలో సందడి చేశారు. 70 ఏళ్ల వయస్సులోనూ ఉత్సాహంగా కళాశాల ప్రాంగణంలో తిరుగుతూ తమ మిత్రులతో ఆనందించారు. ఈ సమ్మేళనానికి దేశం నలుమూలల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. వారి అనుభవాలు వారి మాటల్లోనే...

ఈ కళాశాల ధైర్యాన్నిచ్చింది..



ఈ కళాశాలలో డిగ్రీ చదువుకున్నాను. ఇక్కడ చదువు ఎంతో ధైర్యాన్నిచ్చింది. విద్యాబుద్ధులే కాకుండా మరెన్నో అంశాల్లో చైతన్యవంతం చేసింది. అందువలనే బహుశా నేను ధైర్యంగా ఇస్రో వరకూ వెళ్లగలిగాను. 58 ఏళ్లుగా కేబీఎన్ కళాశాల చక్కని అభివృద్ధిని సాధించింది. నేను చదివినప్పటి కన్నా ఇప్పుడు వసతులు పెరిగాయి. విద్యార్థులు వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి.

– డాక్టర్ జల్లూరి తాయారమ్మ , శాస్త్రవేత్త, ఇస్రో

ఎంతో మంది న్యాయవాదులను అందించింది



ఈ కళాశాల ఎంతో మంది న్యాయవాదులను సమాజానికి అందించింది. కనీసం అరడజనకు పైగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సైతం ఈ కళాశాల నుంచి వచ్చారు. మొదటి నుంచి ఈ కళాశాల విద్యార్థులు అన్ని రంగాల్లోనూ మంచి ఉత్సాహంగా ఉండేవారు. ఎన్నో చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహించటం వలన మా లాంటి ఎంతో మంది న్యాయవాద వృత్తి వైపు కొనసాగారు.

– గోగిశెట్టి వెంకటేశ్వరరావు, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు

కోసాను పటిష్టం చేస్తాం..



కేబీఎన్ ఓల్డ్ స్టూడెంట్స్ అలుమినీ అసోసియేషన్ (కోసా)ను రానున్న కాలంలో మరింత పటిష్టం చేస్తాం. రెండేళ్లగా ఇదే రోజున పూర్వ విద్యార్థుల సమ్మేళనం పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇటీవల మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించాం. అదేవిధంగా రానున్న కాలంలో కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని నిర్ణయించాం. పూర్వ విద్యార్థులందరూ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి.

– డీపీ రామకృష్ణ, పూర్వ విద్యార్థుల సంఘం, అధ్యక్షుడు

ఫుట్‌పాత్ పనులు త్వరగా పూర్తి చేయాలి

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని స్వరాజ్‌మైదాన్‌లో జరుగుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంజీ రోడ్డు వైపు ఉన్న ఫుట్‌పాత్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. వారంలోగా ఎటువంటి లోపం లేకుండా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏఎస్ఎన్ ప్రసాద్‌ను ఆదేశించారు.



ఫుట్‌పాత్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్

జనవరి 20వ తేదీ నాటికి అన్ని పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటుకు తీసుకురావాలన్నారు.

నగరంలో క్రిస్మస్ సందడి



బీసెంట్ రోడ్డులో కొనుగోలుదారుల రద్దీ

క్రిస్మస్ సందర్భంగా నగరంలోని అన్ని దుకాణాల్లో ఆదివారం రద్దీ నెలకొంది. ప్రధానంగా బీసెంట్ రోడ్డు, లెనిన్ సెంటర్‌లోని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దృశ్యాన్ని 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఇంజినీరింగ్ విద్యార్థి అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తండ్రి మందలించాడని ఇంజినీరింగ్ విద్యార్థి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన భవానీపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గొల్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు .. గొల్లపూడి సాయిపురం కాలనీకి చెందిన అల్లం పాపారావు మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి కళాశాలలో ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మొదటి సంవత్సరానికి సంబంధించి కొన్ని సబ్జెక్టులు మిగిలిపోయాయి. ఎందుకు మిగిలిపోయాయని తండ్రి మందలించాడు. దీంతో అవమానంగా భావించిన పాపారావు ఆదివారం ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తాను వెళ్లిపోతున్నానని, తన కోసం వెతక వద్దని లేఖ రాసి పెట్టి వెళ్లాడు. స్నేహితులు, చుట్టుపక్కల వారిని విచారించినా ఆచూకీ తెలియలేదు. దీంతో పాపారావు తండ్రి ఆంజనేయులు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

సామాజిక సాధికార యాత్ర విజయవంతం చేయాలి

పెనమలూరు: కంకిపాడులో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పార్టీ నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. కానూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని కానూరు ప్రాంత నేతలతో ఎమ్మెల్యే పార్థసారథి ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాష్ట్రంలో పేద, మధ్య తరగతి ప్రజల జీవితాలు బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్ జగన్‌ను సీఎంని చేసుకోవాలని పేర్కొన్నారు. జగనన్న ప్రభుత్వం పేదలకు అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడానికే సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని వెల్లడించారు. పార్టీ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలు ప్రారంభం

గుణదల (విజయవాడ తూర్పు): సర్వ మానవాళిని రక్షణ మార్గంలో నడిపించేందుకు లోక రక్షకుడైన ఏసుక్రీస్తు ఈ లోకానికి అరుదెంచారని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు అన్నారు. గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి ప్రారంభమయ్యాయి. పుణ్యక్షేత్ర ప్రధానాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదిక పై సమష్టి దివ్య బలి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులనుద్దేశించి ఫాదర్ జయరాజు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రీస్తు చూపిన మార్గంలో నడుచుకోవాలని సూచించారు. బైబిల్ గ్రంథంలోని క్రీస్తు జనన విశేషాలను వివరించారు. అనంతరం సమష్టి దివ్య బలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని పశువుల పాకను ఏర్పాటు చేసి బాలఏసు ప్రతిమను ఉంచారు. భక్తులు బాలఏసును దర్శించుకుని ఆధ్యాత్మికంగా గడిపారు. భక్తుల కోసం ఆలయ గురువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఫాదర్ దాసి సురేష్, సహాయ గురువులు, మఠకన్యలు పాల్గొన్నారు.



విద్యుత్ వెలుగులో గుణదల చర్చి

కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలి



విజయవాడకల్చరల్: కవులు సమాజాన్ని అధ్యయనం చేయాలని కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు సూచించారు. వాగ్దేవీ కళాపీఠం, విజయవాడ కవన వేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. పూర్ణచందు మాట్లాడుతూ కవులు సమాజ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ద్విశతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ఆధునిక కవిత్వంలో వస్తున్న మార్పులు అంశంగా ప్రసంగించారు. వాగ్దేవీ కళాపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ గానుగుల యుగంధరా చార్య మాట్లాడుతూ సంస్థ ద్వారా వర్ధమాన కవులకు వేదిక కల్పిస్తునట్లు వివరించారు. తెలుగు అధ్యాపకుడు డాక్టర్ జిల్లేపల్లి వేంకటచలపతిరావు వివిధ కవితా ప్రక్రియలు అంశంగా ప్రసంగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు స్వీయ కవితా గానం చేశారు. కవులను నిర్వాహకులు సత్కరించారు.